చాలీ చాలని జీతాలతో చాకిరి

- ఏళ్లతరబడి పనిచేస్తున్నా కనికరించని ప్రభుత్వం
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం మరిచిన ప్రభుత్వం
- ఆరేళ్లుగా వేతనం పెంపుకోసం ఎదురుచూపు


పిల్లలకు పాఠాలను బోధిస్తున్న సీఆర్ఎంటీఎస్ (ఫైల్)

జిల్లాలో పనిచేస్తున్న సీఆర్ఎంటీఎస్‌లు	156
మండల లెవల్ అకౌంటెంట్లు	19
ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు	34
డేటా ఎంట్రీ ఆపరేటర్లు	35

కడప ఎడ్యుకేషన్ : సమగ్రశిక్ష, విద్యా శాఖలో అత్యంత కీలకంగా పనిచేసే చిరుద్యోగులైన సీఆర్ఎంటీ(క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్స్)లు, మండల లెవల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో చాకిరీ చేస్తూ కుటుంబాలను భారంగా మోస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరకులు, ఇంటి అద్దెలు, ఖర్చులతో దిక్కుతోచని పరిస్థితిలో అల్లాడిపోతున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఏ ప్రభుత్వం కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ చాలీచాలని జీతాలతో జీవితాలను ఏ విధంగా సాగించాలని మదిలో మదనపడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్న సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించకుండా, ఉద్యోగుల మధ్య వేతన అసమానతలను పెంచే విధంగా ఈ జీవో నంబర్–2ను అమలు చేస్తోంది. ఈ జీఓ కేవలం ఉద్యోగుల ఆర్థిక భద్రతను దెబ్బతీయడమేగాక, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని విద్యాశాఖలో పనిచేసే పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా విద్యా శాఖలో..

జిల్లా వ్యాప్తంగా మండల వనరుల కేంద్రంలో 156 మంది సీఆర్ఎంటీలు, 19 మంది మండల లెవల్ అకౌంటెంట్స్, 34 మంది ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, 35 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరంతా 2012లో ఉద్యోగాల్లో చేరారు. అప్పట్లో వీరికి నెలకు రూ.18,500 ఉండేది. ఆ తర్వాత వీరికి 2020లో గత వైసీపీలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 23,500కు వేతనం పెంచింది. ఆ తరువాత అధికారంలోకి కూటమి ప్రభుత్వం వారి గురించి పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపచేయరాదని, 2025 జనవరి, 6వతేదీన జీవో నంబర్–2 విడుదల చేసింది. ప్రభుత్వ శాఖలలో మంజూరైన ఖాళీ పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే అర్హులని తేల్చింది. ఈ జీవో రాజ్యాంగ కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమని, కృత్రిమ ప్రాతిపదికలు సృష్టించి శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా ఉండడమే ఈ జీఓ ఉద్దేశమని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే, ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు లేకపోవడం బాధాకరమని. ప్రభుత్వం ఆదర్శ యజమానిగా వ్యవహరించి, ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని కోరుతున్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి..

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలుచేస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినప్పటికీ ఈ ఏడాది కాలంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. ఇటీవల ఎన్టీఆర్ భరోసా పెన్షన్, నూతన రేషన్ కార్డులు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేసినప్పటికీ చిరుద్యోగులకు వర్తింపచేయలేదని వారు తెలిపారు. నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దె విపరీతంగా పెరగడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు సరిపోవడంలేదని వాపోతున్నారు. నెలవారీ ఖర్చుల కోసం అప్పుచేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, ఇంటి అద్దె భృతి, రేషన్ సబ్సిడీ పథకాలను ప్రత్యేకంగా అమలుచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగుల వేతనాలను విరివిగా పెంచే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం వికలాంగులు, ఒంటరి మహిళ పెన్షన్, కుటుంబ సభ్యులకు వద్ధాప్యం పింఛన్ తొలగించారు. వాటిని తిరిగి పునరుద్ధరించి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తోడ్పాటు ఇవ్వాలని కోరుతున్నారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తించాలి

తెలుగుదేశం ప్రభుత్వం రిటైర్‌మెంట్ వయస్సు 58 నుండి 60 ఏళ్లకు పెంచింది. తదనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులకు 62 ఏళ్లకు పెంచింది. కానీ ఈ సౌకర్యం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తించలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అంగన్వాడీ, ఆశా వర్కర్లకు గ్రాట్యూటీ అమలు చేస్తూ, రిటైర్‌మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచినా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం వర్తింప యకపోవడం వారికి నిరాశ కలిగిస్తోంది. అనేక సంవత్సరాలుగా తక్కువ జీతంతో పనిచేస్తూ, ఎలాంటి పదవీ విరమణ ప్రయోజనాలు లేకుండా, రిటైర్ అయ్యేసరికి కుటుంబానికి భారం అవుతున్న పరిస్థితి దురదృష్టకరమని ఆందోళన చెందుతున్నారు. వీరికి కూడా రెగ్యులర్ ఉద్యోగుల్లానే రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలు, గ్రాట్యూటీ, పెన్షన్ పథకం లేదా ఉద్యోగ భద్రతకు దారిచూపే ప్రయోజనాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

నాపై పోలీసులు దాడి చేశారు


చికిత్స పొందుతున్న బాధితుడు సాంబశివ

కడప అర్బన్ : హోటల్‌లో భోజనం చేస్తుండగా మైదుకూరు పోలీసులు తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని మైదుకూరు మండలం జీవీ.సత్రానికి చెందిన కాకాని సాంబశివ ఆరోపించారు. ఈనెల 13వ తేదీన సాయంత్రం తమ గ్రామానికి సమీపంలో భోజనం చేస్తున్నాననే గానీ, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడలేదని చెబుతున్నా లాఠీలతో చితకబాదారని తెలిపారు. ప్రస్తుతం రిమ్స్‌లో గాయాలతో చికిత్స పొందుతున్నానని, తనకు న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

కడపలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు


ఆకస్మిక తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్, అప్సర సర్కిళ్లలో ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలు, ఆర్టీసీ బస్టాండ్‌లో సోదాలు జరిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా వాహనాలను నడిపేటపుడు నిబంధనలను పాటించాలన్నారు. లాడ్జీలలో గదులను అద్దెకు ఇచ్చేటపుడు గుర్తింపుకార్డును తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య


మృతి చెందిన గంగమ్మ

ఎర్రగుంట్ల : మండలంలోని పెద్దనపాడు గ్రామానికి చెందిన చిలంకూరు గంగమ్మ (25) ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని యర్రగుంట్ల పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెద్దనపాడుకు చెందిన వీరాంజనేయులు, లక్ష్మీదేవి కుమార్తె గంగమ్మ. గంగమ్మకు పెళ్లి చూపులు చూస్తున్నా.. అవి కుదరడం లేదు. దీంతో గంగమ్మ తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మీదేవి అనుమానంతో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వంకలోపడి ఎనిమిదేళ్ల బాలుడు మృతి


వంకలో పడి మృతి చెందిన పి. గుణదీపక్

కొండాపురం : అప్పటి వరకు కళ్ల ముందు నవ్వుతూ ఆటలాడుతున్న కొడుకు క్షణాల్లో విగతజీవిగా మారడం ఆ తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చింది. మండలంలోని దత్తాపురం పునరావాస కేంద్రంలోని వంకలో పడి ఎనిమిదేళ్ల బాలుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దత్తాపురం గ్రామానికి చెందిన పాపన్నగారి గుణదీపక్(8) మూడో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం సమయంలో పిల్లలతో కలిసి సరదగా వినాయకుని విగ్రహం తయారు చేసుకోవడానికి బంకమట్టికోసం వంక దగ్గర తీసే సమయంలో ప్రమాదవశాత్తూ అందులో పడిపోయాడు. కుటుంబీకులు గుర్తించేలోగానే బాలుడు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. తల్లిదండ్రులు గంగాధర్, గీతలు గుండెలవిసేలా ఏడ్చారు. బాలుడు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులులి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్‌లో ఉమ్మడి కడప జిల్లా ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 బాలబాలికల రైఫిల్ షూటింగ్, ఫెన్సింగ్, టేబుల్ టెన్నిస్ జిల్లా స్థాయి ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. క్రీడాకారులు తమ నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను ఈనెల 23 నుంచి 26 వరకు కాకినాడ, రాజమండ్రిలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఫెన్సింగ్ పోటీలకు 28 మంది క్రీడాకారులు పాల్గొనగా 14 మంది, రైఫిల్ షూటింగ్‌లో 16 మంది పాల్గొనగా 9 మంది, టేబుల్ టెన్నిస్‌లో 17 మందికి గాను 10 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలను జార్జికారొనేషన్ క్లబ్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 జిల్లా సెక్రటరీ చంద్రమోహన్ రాజు, కోచ్ రాఘవ, అల్లా బకాష్, శివారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

అవార్డులతో పెరిగిన గురువుల బాధ్యత

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం


సత్కారం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

అట్లూరు : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో గురువుల బాధ్యత మరింత పెరిగిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదన విజయకుమార్ తెలిపారు. ఆదివారం పోరుమామిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బి.ఈశ్వర్ రావు అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మాన సభ నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 14 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో పోరుమామిళ్ల ప్రాంత ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసి మేధావులను సమాజానికి అందిస్తున్న అనేక మంది ఉపాధ్యాయులు గుర్తింపునకు నోచుకోని వారుసైతం ఉన్నారన్నారు. పాలకుల విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం నానాటికి సంక్షోభంలోకి నెట్టబడుతోందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. పోరుమామిళ్ల, కాశినాయన మండలాల ఎంఈఓలు కొండిశెట్టి, నిర్మల మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య దేశ భవిష్యత్తును నిర్మించే వారే ఉపాధ్యాయులని, అలాంటి వారిలో విశిష్టమైన సేవలందించిన వారికి అవార్డులు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు చెన్నయ్య, ఈరి బాలజోజి, సాంస్కృతిక కమిటీ జిల్లా కన్వీనర్ కె.ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి పేరుతో రాష్ట్ర వ్యాప్త జాతా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా 19న మధ్యాహ్నం పోరుమామిళ్లకు జాతా చేరుకుంటుందని చెప్పారు. ఈ జాతాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మార్కారెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.నారాయణరెడ్డి, గురుమూర్తి, ఓ.రాయప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భైరవ ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు రమణమూర్తి, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కృష్ణయ్య, ఖాజా నాయబ్ రసూల్, బాల ఓబయ్య, కేవీ సుబ్బారెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, కె.చెన్నకృష్ణయ్య, కె.పిచ్చిరెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న 4 విడతల ఏడీలను, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 57 మెమో ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. టీచర్లను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరుతూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. మీ సమస్యలను సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏ వెంటనే ప్రకటించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

అట్లూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ పోరుమామిళ్ల రీజియన్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ 12వ పీఆర్సీని త్వరితగతిన అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను చెల్లించాలన్నారు. రీజనల్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, మూల్యాంకన విధానంలో మార్పు చేసి ఉపాధ్యాయుల బోధనను సరళతరం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బి.కోడూరు మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఆనంద్, ఎస్.భాస్కర్ రెడ్డి, జె.సుబ్బయ్య, ఎస్.అన్వర్ బాషా, బి.సురేంద్రనాథ్ రెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, వి.వెంకటరామిరెడ్డి, బి.ఆదిశేషారెడ్డి, సీతారామిరెడ్డి, కె.రామ్మోహన్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, గురివిరెడ్డి, నాగ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి


చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శాప్ మాజీ డైరెక్టర్ కొండు చంద్రశేఖర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొని చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారని, ఆయన లేని లోటు బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

జమ్మలమడుగు రూరల్ : కారు ఢీకొన్న సంఘటనలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు కుడి కాలుకు తీవ్రగాయాలైన సంఘటన జమ్మలమడుగు పట్టణంలో చోటు చేసుకొంది. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ముద్దనూరు రహదారిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద బైక్ యూ టర్న్ తీసుకుంటుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఆయన కుడి కాలుకు తీవ్రగాయమైంది. స్థానికులు, బంధువులు ఆటోలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, మునిసిపల్ కో అప్షన్ సభ్యుడు గజ్జల లక్ష్మయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితర నాయకులు వచ్చి బాధితుడుని పరామర్శించారు.

గంజాయి స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బిజ్జవారిపల్లి క్రాస్ వద్ద ఆదివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నీలకంఠ, సీఐ తులసీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఐదుగురు 2.700 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. రాకేష్, హరి, సుమన్‌లను అరెస్ట్ చేసి ఆటో, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. మరో ఇరువురు పరారీలో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. అరెస్ట్ చేసినవారిని కోర్టులో హాజరు పరిచారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం

కేవీపల్లె : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని దిగువగల్ల గంటావారిపల్లెలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గంటావారిపల్లెకు చెందిన అనసూయమ్మ ఇంటిలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు పీలేరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు అదుపుచేశారు. అప్పటికే ఇంటిలోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. విలువైన వస్తువులు, ఆస్తి పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు బాధితురాలు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి జిల్లాను ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్ : త్వరలో జరగనున్న శాసనసభ సమావేశాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లా ఏర్పాటుకు తీర్మానం చేయాలని వీరబ్రహ్మేంద్ర స్వామి జిల్లా సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవిరెడ్డి బ్రహ్మరెడ్డి, డి.చంద్రఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక జిల్లా సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన బద్వేలు నియోజకవర్గాన్ని ఇతర జిల్లాల్లోకి మార్చే బదులు బద్వేలు కేంద్రంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి పేరుతో ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌యాదవ్, గౌరవాధ్యక్షులు బ్రహ్మయ్య, ధనుంజయ, బి.సి.రమణ, ఉపాధ్యక్షులు పిచ్చయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాస విగ్రహావిష్కరణను బహిష్కరిస్తున్నాం

రాయచోటి : తిరుపతి పట్టణంలో రాష్ట్ర మంత్రి సవిత చౌదరి ఆధ్వర్యంలో అక్టోబర్ 5న జరిగే కనకదాస విగ్రహావిష్కరణను బహిష్కరిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా కురబ సంఘం సభ్యులు, నాయకులు ప్రకటించారు. రాయచోటిలోని అజయ్ కల్యాణ మండపంలో కురబసంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర కురవ, కురబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న మంత్రివర్గ విస్తరణలో కురబ కులం పేరు చెప్పుకుంటూ తన భర్త వెంకటేశ్వరచైదరిని పదవిని కాపాడుకునే ప్రయత్నం మంత్రి సవిత చేయడాన్ని తాము ఒప్పుకోమన్నారు.

ఫేక్ సర్టిఫికెట్లతోనే రిజిస్ట్రేషన్

కోట్ల రూపాయల ఆస్తులకు కన్నం



ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రొద్దుటూరు : వంశపారంపర్యంగా కాపాడుకుంటూ వస్తున్న ఆస్తులను తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి అమ్ముకోవడం ప్రొద్దుటూరులో చర్చనీయాంశంగా మారింది. ఒకరి ఆస్తి మరొకరికి మారాలంటే ఎన్నో రకాల నిబంధనలున్నాయి. అయితే అన్నింటినీ సులువుగా తయారు చేసి నకిలీ ముఠా కోట్ల రూపాయల ఆస్తులకు కన్నం వేస్తోంది. తాజాగా ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన గంజికుంట సుబ్బరాయుడు ఆస్తే ఇందుకు ఉదాహరణ. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ రిటైర్ అయిన ఆయనకు 1986లో మైదుకూరు రోడ్డులోని ఎన్జీఓ ప్లాట్లలో ప్లాట్ నంబర్ 300ను కేటాయించారు. అప్పటినుంచి ఇప్పటి వరకూ ఆయన తన ఆస్తిని కాపాడుకుంటూ వస్తున్నారు. తరచూ తన ప్లాట్ వద్దకు వెళ్లి చూసుకోవడం జరుగుతోంది. చుట్టుపక్కల వారు చెప్పడంతోనే ప్రస్తుతం తన ఆస్తిని మరొకరికి దొంగగా రిజిస్టార్ చేయించారని బయటపడింది.

ఫేక్ సర్టిఫికెట్ల ముఠా ఉందా..

గంజికుంట సుబ్బరాయుడతోపాటు ఆయన సతీమణి లక్ష్మీదేవి మరణించినట్లు డెత్ సర్టిఫికెట్లు సృష్టించడం హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి సుమారు రూ.2 కోట్ల విలువైన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది. సజీవంగా ఉన్న సుబ్బరాయుడుతో పాటు ఆయన సతీమణి రిజిస్ట్రేషన్‌లో డెత్ సర్టిఫికెట్లు సమర్పించారు. అయితే ఈ డెత్ సర్టిఫికెట్లు మున్సిపాలిటీ నుంచి జారీ చేయలేదు. కేవలం సొంతంగా ఫేక్ డెత్ సర్టిఫికెట్లను తయారుచేసి అమ్మడం జరిగింది. ఈ సర్టిఫికెట్లలో సూచించిన 2015, 2017 సంవత్సరాలలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఉన్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అప్పట్లో రఘునాథరెడ్డి లేరు. 2024 సాధారణ ఎన్నికల సమయంలో రఘునాథరెడ్డి బదిలీపై వచ్చి వెళ్లారు. కాగా ప్రతి ఎన్జీఓ ప్లాట్‌కు సంబంధించి ప్రొద్దుటూరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ నుంచి లేఖను జారీ చేసిన తర్వాతే ప్లాట్‌ను అమ్ముతున్నారు. ఈ ప్లాట్ అమ్మకానికి సంబంధించి కూడా ఆగస్టు నెల 8న సంఘం కార్యదర్శి సాల్మన్ లేఖ ఇచ్చినట్లు పొందుపరిచారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ఫేక్ సర్టిఫికెట్ల ముఠా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గతంలో కూడా పలు సందర్భాల్లో ఇలాంటి నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగాయి.

అందరి మద్దతుతో ప్రొద్దుటూరు జిల్లాను సాధిద్దాం


ప్రొద్దుటూరు జిల్లా సాధనకు సంఘీభావం తెలుపుతున్న జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు

ప్రొద్దుటూరు : అన్ని వర్గాల మద్దతు ప్రొద్దుటూరు జిల్లాను సాధిద్దామని ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంత ప్రజలతో పాటు రాజకీయ నేతలు, వ్యాపార, వాణిజ్య సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల, కులసంఘాల ప్రతినిధులందరిని ఏకదాటిపైకి తీసుకొచ్చి ప్రొద్దుటూరు జిల్లాను సాధిద్దామని తెలిపారు. జనాభా ప్రాతిపదిక కానీ, అవకాశాల పరంగా కానీ ప్రొద్దుటూరును జిల్లా కేంద్రానికి అన్ని విధాలా అనువైన ప్రాంతమన్నారు. ప్రస్తుతం మన ప్రతిపాదనలో ఉన్న జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాలకు మధ్యలో ఉన్న ప్రాంతం అన్నారు. రాయచోటి, నంద్యాల వంటి పట్టణాలు ఇప్పటికే జిల్లా కేంద్రాలుగా మారాయని, మదనపల్లె, మార్కాపురం, హిందూపురం లాంటి పట్టణాలు జిల్లా కేంద్రాలుగా ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ రెండో ముంబై, రెండో మైసూరుగా ఖ్యాతిగాంచిన ప్రొద్దుటూరును తప్పనిసరిగా జిల్లాగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జేఏసీ ఏర్పడిన 15 రోజుల్లో ఇప్పటికే పలు వ్యాపార సంస్థలు, కుల సంఘాల ప్రతినిధుల మద్దతు కోరామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ప్రొద్దుటూరు జిల్లాను సాధిస్తామన్నారు. త్వరలోనే ప్రజలతో భారీ ఎత్తున ర్యాలీ, మానవ హారం నిర్వహించడంతోపాటు అసెంబ్లీ సమావేశాల్లో సీఎంతోపాటు మంత్రులకు వినతిపత్రాలను సమర్పిస్తామన్నారు. ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితిలో ప్రొద్దుటూరు ప్రజలు ఎవరైనా స్వచ్ఛందంగా బాధ్యతలు నిర్వహించవచ్చని తెలిపారు. ఇక్కడ కులం, మత, ధనిక, పేద తారతమ్యాలు లేవని ఎవరైనా వచ్చి ఉద్యమంలో పాల్గొనవచ్చునన్నారు. జేఏసీ నాయకుడు డాక్టర్ డి.దస్తగిరిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సభ్యులు సీవీ సురేష్, శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, కేజే రఘురామిరెడ్డి, భాస్కర్‌రావు, సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటజనార్దన్‌రెడ్డి, గంగిరెడ్డి, బొర్రా రామాంజనేయులు, ముడిమెల కొండారెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని గూడూరు అప్పయ్యగారి సుబ్బరాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 1998–99 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు రామమునిరెడ్డి, జయరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, బాబ్జిలతో ఇంకా పలువురు ఉపాధ్యాయులు హాజరు కాగా వారితో విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు వారికి పాదాభివందనాలు చేస్తూ శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చదువుకున్న సమయంలో ఉపాధ్యాయుల బోధన, చదువుకున్న తీరు, ప్రస్తుతం విద్యార్థులు స్థిరపడిన జీవిత విధానాలను తెలియజేసుకున్నారు. భార్యాభర్తలు, పిల్లలతో కలసి పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరుపుకోవడం ఆనందంగా ఉందని పలువురు పూర్వ విద్యార్థులు తెలిపారు.


చాపాడు జెడ్పీ హైస్కూల్‌లో 1998–99 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మహాదేవ హైవే రెస్టారెంట్ నందు పనిచేయుటకు 1–2 సం॥ అనుభవం గల హెల్పర్స్ కావలెను. అడ్రస్ సాక్షి సర్కిల్ పులివెందుల రోడ్, కడప సంప్ర: ✆ 70133 82066

■ కడప జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేయుటకు సేల్స్ బాయ్స్ కావలెను. సంప్ర : ✆ +919490122498.

■ కన్ఫర్మ్ జాబ్ VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు–40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd 8317512135

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. శ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640468899, 9640258899

■ Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82476 08801

FACULTY TEACHERS

■ Wanted Teachers Subject maths 3rd to 7th Classes TKR High School Jammalamadu Contact Cell: 9603737014

■ Wanted Trainted Teachers to Teach English, Telugu, Social, Sciences & P.E.T in CBSE syllabus, Attractive salary, E.P.F Applicable apply Through email: vidyamandircdp@gmail.com,vidyamandir e.m highschool, kadapa Ph: 9392923938, 08562242343

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ధృవీకరించుకునే బాధ్యత పాఠకులదే. ప్రకటనదారులు తెలిపే వివరాలకు సాక్షి ఎలాంటి బాధ్యత వహించదు. ఈ విషయాన్ని గమనించగలరు.



ప్రజ్ఞా శిఖరం 'మోక్షగుండం'

- నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి
- ఇంజనీర్ల దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆధునిక కాలంలో ఇంజినీరింగ్ వ్యవస్థకు ఎంత గొప్ప ప్రాధాన్యత ఉందో అందరికీ తెలిసిందే. మానవుడికి కనీస అవసరాలైన కూడు, గూడు, వస్త్రాలలో ఒకటైన గూడు (ఇల్లు) నిర్మాణంలో ఇంజినీర్లది ముఖ్యమైన పాత్ర. నివాస గృహాలైనా, కార్యాలయాలు, కర్మాగారాలైనా, చర్చిలు, మసీదులు, ఆలయాలు, చెక్‌డ్యాంలు, భారీ ప్రాజెక్టులు ఇంజినీర్ల ప్రతిభకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. మన దేశానికి చెందిన గొప్ప ఇంజినీరు, సాంకేతిక ప్రజ్ఞాశిఖరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన పుట్టిన రోజు సెప్టెంబరు 15ను ఇంజనీర్ల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాము. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఇంజినీర్లకు సాక్షి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

'మోక్షగుండం' జీవిత విశేషాలు

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఉన్నత స్థాయి సాంకేతిక ప్రజ్ఞామూర్తిగా పేరు గడించారు. సివిల్ నిర్మాణాలు, నీటిపారుదల, వరదల నివారణ కోసం ప్రత్యేక నిర్మాణాలు ఇలా ఎన్నో విశిష్టమైన కట్టడాల నిర్మాణంతో ఆయన ఇతర దేశాల సాంకేతిక నిపుణుల ప్రశంసలు పొందారు. 1816లో కర్ణాటకలో కోలార్ జిల్లాలో జన్మించిన మోక్షగుండం పూర్వీకులు ప్రకాశం జిల్లాకు చెందిన వారే. బెంగళూరు, పూణేలలో విద్యాభ్యాసం చేసి సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపారు. ప్రత్యేకించి నీటిపారుదల నిర్మాణాలపై ప్రత్యేక అధ్యయనం చేసిన ఆయన ఆ రంగంలో సమకాలిన ఇంజినీర్ల కంటే ఎంతో ఉన్నత స్థానంలో నిలిచారు. 1908లో మైసూరు మహరాజ ఆయనను తమ రాష్ట్రంలోని రాజ్యసభ చీఫ్ ఇంజినీరుగా నియమించారు. ఆయన మార్గదర్శకత్వంలోనే కావేరి నదిపై కృష్ణరాజసాగర్‌ను నిర్మించారు. 1912లో మైసూరు దివాన్ అయ్యారు. కర్ణాటకలో ఆయనదైన నిర్మాణాలెన్నో నేటికీ అందరినీ ఆకర్శిస్తూ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

మన ప్రాంతంలో..

జిల్లాలో బ్రిటీషు కాలం నాటి ఎన్నో భవనాలు నేటికి పటిష్టంగా నిలిచి ఉండటాన్ని గమనించవచ్చు. ప్రభుత్వ పురుషుల కళాశాల, కలెక్టర్ బంగ్లా, ఎస్పీ కార్యాలయం, బంగ్లా, పాత కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం నేటికి నాటి ఇంజినీర్ల ప్రతిభను చాటుతున్నాయి. జిల్లాలో 100 సంవత్సరాలు దాటినా పటిష్టంగా ఉన్న ఎన్నో చర్చి భవనాలను కూడా గమనించవచ్చు.

మోక్షగుండం ఆదర్శంగా

తమ శాఖలో మేరు సమానులైన మోక్షగుండెం విశ్వేశ్వరయ్యపై గౌరవంతో కడప నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఎల్‌ఐసీ సర్కిల్‌లో ఉన్న ఈ విగ్రహం వద్ద ప్రతి ఏడాది ఇంజనీర్ల దినోత్సవ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. ఆయన పేరిట సమీపంలోనే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.



కడపలోని విశ్వేశ్వరయ్య విగ్రహం

ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయొద్దు

మైదుకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయులకిచ్చిన ఆర్థికపరమైన అంశాల హామీ అమలు విషయంలో ప్రభుత్వం మోసం చేయవద్దని, ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మైదుకూరులో ఆదివారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన నిర్వహించిన సంఘం జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశంలో రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలాగే కూటమి ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసపుచ్చుతోందని ఆరోపించారు. మొన్నటి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఎంప్లాయి వెల్ఫేర్ స్కీంలను అమలు చేయలేదని, 12వ పీఆర్సీ అమలు ఇప్పటికే రెండు సంవత్సరాలు ఆలస్యమైనా మధ్యంతర భృతి ప్రకటననే చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికి నాలుగు డీఏలు ఉద్యోగులకు ఈ ప్రభుత్వం బకాయి ఉందని, రూ.20వేల కోట్లకుపైగా బకాయిలను ఇంకా చెల్లించాల్సి ఉందన్నారు. ఎటువంటి ఆశాజనకమైన పరిస్థితులు ప్రభుత్వం వైపు నుంచి కనిపించడం లేదని, అక్టోబర్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం ఉద్యమ కార్యాచరణకు దిగుతామని స్పష్టం చేశారు. అసంబద్ధ, తిరుగోమని విధానాలతో విద్యారంగానికి నష్టం వాటిల్లుతోందని రఘునాథరెడ్డి ఆరోపించారు. మూల్యాంకన విధానాన్ని సవరించాలని, ప్రశ్నపత్రాల రూపకల్పనలో ప్రామాణికత పాటించలేదని విమర్శించారు. డీఎస్సీ 2025 ద్వారా అన్ని ఖాళీలను భర్తీ చేసి బదిలీ పొందిన ప్రతి ఉపాధ్యాయుడికి రిలీవర్లను కేటాయించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు, సీపీఐ జిల్లా కార్యదరి గాలి చంద్ర, ఏఐటీయూసీ నాయకులు నాగసుబ్బారెడ్డి, బండి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం సీనియర్ నాయకుడు సూరే కృష్ణయ్య, గురుకుమార్, మల్లేష్ రెడ్డి, బీకే సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రొద్దుటూరు : అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, ఎస్సీ ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం నిలుపుదల చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రద్దైన నాటి నుంచి విద్య, ఉద్యోగాల్లో మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగలకు ఆత్మవిశ్వాసం కలిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్‌ను నియమించిందన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. దివ్యాంగులకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.


మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ దండు వీరయ్య మాదిగ

వెల్లాల పాత వంతెనపై రాకపోకలు ప్రారంభం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామ సమీపంలోని కుందూనదిపై ఉన్న పాత వంతెనపై గత రెండు రోజులుగా వర్షం నీరు మూడు అడుగుల మేర ఉధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలో ఆ వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. ఆదివారం ఉదయానికి వర్షం నీరు తగ్గుముఖం పట్టడంతో తిరిగి ఆదారిలో రాకపోకలు ప్రారంభమయ్యాయి. రాజోలి ఆనకట్ట నుంచి ఆదివారం 30 వేల క్యూసెక్కుల నీరు పోతుండగా సోమవారం 12528 క్యూసెక్కుల నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు.


వెల్లాల పాత వంతెనపైన తగ్గిపోయిన వర్షం నీరు

హోల్ సేల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : స్థానిక గాంధీ రోడ్డులోని తల్లం సాయి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రొద్దుటూరు హోల్ సేల్ మెడికల్ అసిసోయేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతనకావర్గాన్ని ఎన్నుకున్నారు అసోసియేషన్ అధ్యక్షుడిగా నాలుగో సారి చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా టి.ద్వారకానాథ్, కోశాధికారిగా బి.కేశవులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరసింహా మూర్తి మాట్లాడుతూ ఈనెల 22 నుంచి జీఎస్టీలో వస్తున్న మార్పులను వివరించారు. ప్రభుత్వం తగ్గించిన పన్ను తగ్గింపు వినియోగదారులకు అందేలా చేయాలని కోరారు. నూతన ఔషధ నియంత్రణ చట్టాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో అసోసియేషన్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి చంద్రశేఖర్, ద్వారకానాథ్, కేశవులు























































